ఘనంగా లక్ష్మీ చెన్నకేశవునికి శాంతి కళ్యాణం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయదేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కళ్యాణానికి ఉభయదాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే ప్రసన్న వెంకటేశ్వర స్వామి, కళ్యాణ వెంకటేశ్వర స్వామి వార్లకు అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ఆలయాల్లో కార్తీక సందడి

కొనకనమిట్ల: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కొనకనమిట్ల రామ దూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు.

బేస్తవారిపేట: మండలంలో జేబీకే పురం సమీపంలోని చలమకొండలో సిద్ధి ఆది భైరవేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కార్తీకమాస వన భోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో, కార్తీక వనభోజన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

పొదిలి రూరల్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహశీల్దారు ఎంవీ కృష్ణారెడ్డి అన్నారు. పొదిలి మండలంలో ఓటరు నమోదు కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 66 పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోలు అందుబాటులో ఉండి ఓటరు నమోదు, సవరణలు కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. ఫారం-6 ఓటరు నమోదు, ఫారం-7 తొలగింపు, ఫారం-8 మార్పు అవసరాలు, ఓటరు నమోదు గురించి ప్రజలకు వివరించి వారి నుంచి దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఆర్ఐ కిలారి సుబ్బారావు ఉన్నారు.

పనిభారం తగ్గించండి

మార్కాపురం టౌన్: వ్యవసాయ సహాయకులుగా పనిచేస్తున్న తమపై ఒత్తిడి, పనిభారం ఎక్కువైందని, తగ్గించాలని కోరుతూ వ్యవసాయశాఖ జేడీ శ్రీనివాసరావుకు శనివారం దర్శిలో వినతిపత్రం ఇచ్చారు. ఈమేరకు సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు జక్కి గణేష్ సాగర్ తెలిపారు.వెంకటసుబయ్య, వెంకటేష్, జిలాని పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

మార్కాపురం: పట్టణంలోని శివాలయం వీధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కొండా శ్రీనివాసులును అరెస్టు చేసి 21 లిక్కర్ బాటిల్స్ శనివారం స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు. అనధికారికంగా ఎవరైనా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్సై మునాఫ్, కానిస్టేబుల్స్ కోటి నాయక్, షరీఫ్ పాల్గొన్నారు.

న్యాయం చేయండి

మార్కాపురం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఏర్పడుతున్న 13 విద్యుత్ సర్కిల్ ఆఫీసుల్లో ఔట్ సోర్సింగ్ సిబ్బందిగా అర్హతను బట్టి మీటర్ రీడర్లను తీసుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని కోరారు. శనివారం ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిసి సమస్యలను వివరించారు. కొత్తగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో తమ ఉపాధి కొల్పోతున్నామని, న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. బి.నారాయణ, టి.సతీష్‌కుమార్, బి.మల్లయ్య, సుబ్రమణ్యం, రమేష్, చిరంజీవి, నాగార్జున, అంజిరెడ్డి, మహమ్మద్, ఉమర్, నాని పాల్గొన్నారు.

గిరిజన కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ పరిశీలన

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని గిరిజన కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీని ఐటీ డీఏ ప్రాజెక్టు అధికారి వెంకట శివప్రసాద్ శనివారం పరిశీలించారు. గిరిజన గోదాములను తనిఖీ చేసి అధికారులకు సూచనలు చేశారు. గోదాములను పరిశుభ్రంగా ఉంచుకుని, సరుకులను ఎప్పటి కప్పుడు పాఠశాలలకు తరలించాలని ఆదేశించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. సొసైటీ మేనేజర్ పుల్లారావుకు పలు సూచనలు చేశారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త

- పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్ఐ

కొనకనమిట్ల: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ టి.రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని గొట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులతో సమావేశం నిర్వహించి వారికి విద్యార్థి దశలో ఎలా నడుచుకోవాలి, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చదువుకునే సమయంలో పక్కదోవ పడితే ఎదుర్కొనే ఇబ్బందులు గురించి తెలియజేశారు. ముఖ్యంగా అమ్మాయిలతో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, అనుమానాస్పదంగా సంచరిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ రాజ్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, హెచ్ఎం విజయలక్ష్మి, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ఓంకార్

కంభం: చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవడంతో పాటు క్రమశిక్షణ, చక్కని అధ్యయనం ద్వారా అభ్యున్నతి సాధించాలని గిద్దలూరు కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఓంకార్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చట్టాలపై అవగాహన అవసరం అన్న అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అక్రమ నిర్బంధం నుంచి హెబియస్ కార్పస్ పిటిషన్ ద్వారా తక్షణ న్యాయం లభిస్తుందన్నారు. బాల కార్మిక వ్యవస్థ లేకుండా చేసేందుకు చట్టాలున్నాయని, బాల్య వివాహాల నిరోధానికి, వేధింపుల నిరోధానికి చట్టాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐఓ సైమన్ విక్టర్, లీగల్ వలంటీర్లు చిట్లూరి ఏలియా, యోబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంభంలో ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ

కంభం: నియమ నిబద్ధతకు నిలువెత్తు రూపం ఎన్‌సీసీ అని మండల విద్యాశాఖాధికారి మాల్యాద్రి అన్నారు. ఈనెల 24న 76వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వాసవీ జూనియర్ కళాశాల, ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం, పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ఇక్బాల్, ప్రసాద్, ప్రిన్సిపాల్ లు కె.రాము, డీసీహెచ్ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

కొమరోలు: పట్టణంలో శనివారం ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆదివారం ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల కూడలిలో మానవ హారంగా ఏర్పడ్డారు. పొడి చెత్త, తడి చెత్త వేరు చేయడం వలన కలిగే ఉపయోగాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు

మార్కాపురం: పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు నిబంధనలు అమలుచేస్తున్నామని, ప్రజలు సహకరించాలని సీఐ సుబ్బారావు తెలిపారు. సప్తగిరి వై. జంక్షన్ వద్ద నుంచి కంభం సెంటరు వరకు వెళ్లే వాహనాలు విశ్వేశ్వర థియేటర్, రాధాకృష్ణ థియేటర్, జువ్విచెట్టు, శివాలయం ఆర్చి, రథం బజారు నుంచి అమ్మవారిశాల మీదుగా అప్సర సెంటరు వద్ద మెయిన్ రోడ్డులో కలిసి కంభం సెంటరుకు చేరుకోవాలన్నారు. నాయుడు బజారు షాపు యజమానులు, ప్రజలు రథం బజారు నుంచి వెళ్లాలన్నారు. అరవింద ఘోష్ స్ట్రీట్ నుంచి వచ్చే వాహనాలు కూడా రథం బజారుకు ఎదురు వెళ్లకుండా అమ్మవారిశాల మీద నుంచి అప్సరా సెంటరు ద్వారా మెయిన్ రోడ్డులోకి వెళ్లాలని చెప్పారు. కమిషనర్ నారాయణరావు, పట్టణ ఎస్సైలు సైదుబాబు, రాజ మోహన్‌రావు ఉన్నారు.

అక్రమ మద్యం కలిగిన మహిళ అరెస్ట్

గిద్దలూరు రూరల్: అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉన్న ఓ మహిళను అరెస్టు చేసినట్లు సీఐ సురేష్ తెలిపారు. మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో తనిఖీలు చేపట్టగా, ఓ మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడిందన్నారు. ఆమె వద్ద నుంచి 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ప్రజలకు చెప్పింది చేసి చూపిన జగనన్న

మార్కాపురం టౌన్: రాష్ట్ర ప్రజలకు చెప్పింది చేసి ఆచరణలో చూపిన నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల పాలనలో మూడేళ్ళు కరోనా కారణంగా రాష్ట్రంపై తీవ్ర ఆర్థిక మాంద్యంలో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలే కాకుండా చేయని హామీలను కూడా అమలు చేసి చూపించారని గుర్తు చేశారు. కానీ సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఖజానా ఖాళీ తమ్ముడు.. అని మొసలికన్నీరు కార్చుతూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి కూటమి సర్కార్‌కు జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి ఆ తరువాత వైఎస్సార్ సీపీ పేరెత్తితే బాగుంటుందని, ఏపీలోని కూటమి సర్కార్‌కు ఆయన సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముందు ముఖం కూడా చెల్లని కూటమి నేతలు విమర్శలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు.

మహాధర్నా జయప్రదం చేయాలి

పొదిలి: కేంద్రంలోని బీజేపీ సంకీర్ణ ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న జిల్లా కలెక్టరేట్ ఎదుర జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు కోరారు. సన్నాహకాల్లో భాగంగా శనివారం కాటూరివారిపాలెం, పొదిలిలో జరిగిన రైతు సంఘాలు, నాయకుల సమావేశంలో మాట్లాడారు. డి.సుబ్బారెడ్డి, శ్రీరామ కోటేశ్వరరావు, ఏ.బాదుల్లా, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం ఎంఈఓగా శర్వాణి

మార్కాపురం టౌన్: మండల విద్యాశాఖాధికారిగా టి.శర్వాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కంభం ఎంఈఓ పనిచేస్తు బదిలీపై మార్కాపురం వచ్చారు.

బాలికలకు అవగాహన సదస్సు

పొదిలి: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు పలు విషయాలపై అవగాహన సదస్సు జరిగింది. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాలికలు చదువులో ముందుండాలనే ఏకైక లక్ష్యంతో కష్టపడి చదువుకోవాలన్నారు. ఎస్సై వేమన, హెచ్ఎం కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన

పొదిలి: పట్టణంలోని పలు పోలింగ్ బూతులను తహసిల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా బూత్‌లను పరిశీలించి బీఎల్‌ఓలకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఆర్ఐ కె.సుబ్బారావు, సీఓ భాను ఉన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న డాక్టర్ రామకృష్ణ

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని పూల సుబ్బయ్య కాలనీలో ఉన్న మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు డాక్టర్ దర్శి రామకృష్ణ తెలుగు, ఇంగ్లిషుకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను శనివారం అందజేసినట్లు హెచ్ఎం రవికుమార్ తెలిపారు. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి పాస్ అవటంతో పాటు 550 పైగా మార్కులు సాధించాలని కోరారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 550కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందిస్తానని ప్రకటించి ప్రోత్సహించారు. డాక్టర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పత్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు కె.వి రమణారెడ్డి, వెంకటేశ్వరరావు, సుధాకర్, బాదుల్లా, శ్రీనివాసరెడ్డి, ఆదిలక్ష్మి, సువర్చలారాణి, జయప్రకాష్, సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

శానిటైజర్ వర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలని నిరసన

రాచర్ల: మండలంలోని పాలకవీడు ఎంపీపీ స్కూల్లో పదేళ్లుగా శానిటైజర్ పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న దమ్ము భారతిని విధుల నుంచి తొలగించడం అన్యాయమని, ఆమెను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య అధ్వర్యంలో స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఆమె వైఎస్సార్ సీపీకి ఓటు వేసిందనే కారణంతో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు విధుల నుంచి తొలగింపజేసినట్లు ఆరోపించారు. భారతికి న్యాయం జరిగేంత వరకూ సీఐటీయూ అండగా ఉంటుందని ఆవులయ్య తెలిపారు.